


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### వీళ్ళు మనుషులా?

**మా చిన్నప్పటి రోజులని** పూర్వకాలం అనచ్చేమో! పూర్వకాలం ఏదైనా సందేహం వస్తే నాన్నని అడిగేవాళ్ళం. కొనిపెట్టాలంటే అమ్మని అడిగేవాళ్ళం. సలహా కావాలంటే మావయ్యలనీ, అరువు కావాలంటే పక్కింటివాళ్ళనీ, అప్పు కావాలంటే స్నేహితులనీ అడిగేవాళ్ళం.

రోజులు మారిపోయాయి. ఇప్పటి పిల్లలు సందేహాలొస్తే గూగుల్, ఏవైనా కొనాలంటే ఎమెజాన్, తినాలనిపిస్తే ‘జొమేటోస్,‘ చూడాలంటే ‘యూట్యూబ్‘. వాళ్ళకి అమ్మ ‘యూట్యూబ్‘ అన్నీ చూపిస్తుంది ఎడల్ట్ మేటర్ సెన్సార్ చేసి. తండ్రి ‘గూగుల్‘ ఏదైనా చెప్పగలడు. ‘మేట్రిమోనీ‘ పక్కింటి ఆంటీ, ‘ఆర్క్యూట్‘ జబ్బు చేసి చనిపోయిన తాతయ్య. ‘ఎఫ్.బి‘ క్లాస్‌మేట్స్.

చిన్నప్పుడు వేసవి సెలవులొస్తే ఇళ్ళకి పెద్దమ్మ, చిన్నమ్మ పిల్లలొచ్చేవాళ్ళు. వాళ్ళు చెప్పే విశేషాలూ వింతలూ నోళ్ళు తెరుచుకుని వినే వాళ్ళం. కొన్నిసార్లు పెద్దమ్మ పిల్లలు బట్టలు పొట్టివైపోతే కూడా మేము కట్టేవాళ్ళం. ‘బెగ్గర్స్ ఆర్ నాట్ చూజర్స్‘ అని ఇంగ్లీషు సేయింగ్ ఉంది. కానీ అది అబద్ధం. మా తొమ్మిది గంటల ముష్టివాడికి, ఎదురింటి ఫకీరు ఇంట్లో ముష్టి ఇష్టం ఉండేదికాదు. ఓసారి ఫకీరమ్మ "ఇదిగో పులుసూ అన్నం జోలె పట్టు" అని  బిచ్చగాడి వెనక పరిగెడ్తుంటే "నీ పప్పుచారు నాకొద్దు" అని ముష్టివాడు పారిపోవడం, మొగుడూ, పిల్లలూ నిస్సహాయంగా ఆమెకేసి చూడడం నాకు గుర్తుంది.

అలాగే కార్ల దగ్గర అడుక్కునే ముష్టివాళ్ళు బైక్‌ల వాళ్ళదగ్గర అడుక్కోవడం తమస్థాయికి తక్కువ అనుకుంటారు. ఇంక వేసవి సెలవలకొచ్చే కజిన్స్ దగ్గరకొస్తే, వాళ్ళ ఊర్లో ప్రతివాడూ ఒక ఎన్.టీ.ఆర్ అన్నట్లు ఉండేవి వాళ్ళ కబుర్లు. వెంటనే ఆ ఊరు వెళ్దాం అనిపించేది.

అలాగే సందానీ వాళ్ళ చిన్నాయన ఇంటికెళ్ళి "నాదీ నాయినా వారం వారం నాకీ సినిమా చూపిస్తాయి. నేనూ వందరూపాయలు తక్కువ ఇస్తే తీస్కోను. దినాం కొత్త సైకిల్ అద్దెకి తీస్కుంటాయ్. కోడికూర లేకుంటె అన్నం తినయ్. కొత్త బట్టలు లేకుంటే స్నానం చెయ్యయ్" అని ఎన్నో గొప్పలు చెప్పొచ్చాడుట. కానీ వాళ్ళ చిన్నాయన పిల్లలొచ్చినప్పుడు ఏమైంది?

"అరే ఔలా.. గోబర్ లావ్! జల్దీ.. ఉఠో" అని వాళ్ళమ్మ పొద్దుటే లేపి సుప్రభాతం పాడింది.

వాళ్ళ నాన్న సందానీని పడుకుంటే వచ్చి ఒక 'లాత్' తన్ని "అరె చోర్ కహీకా.. ఏక్ రూపాయ్‌తో సిగిరెట్ తెమ్మంటే, చారానా కొట్టేస్తావురా?" అన్నాడు.

సందానీని చూసి అపాజాన్, భాయ్ జాన్ నవ్వారు. సందానీకి తలకొట్టేసినట్లు అయింది. వాళ్ళ నాన్న జుబ్బా మడిచి కుట్టింది వేసుకుంటే, వీడికి చేతులున్నట్లు తెలిసేదికాదు. అది వేసుకుని, లోపల చెడ్డీ వేసుకోకపోయినా అస్సలు తెలిసేది కాదు. అది వేసుకుని తట్టపట్టుకుని పేడకోసం వెళ్ళినవాడు, కోపం వచ్చి వెనక్కొచ్చి వాళ్ళనాన్న సైకిల్‌లో గాలి తీసేసి వెళ్ళిపోయాడు. సాయంత్రం స్కూల్ విడిచినా ఇంటికి రాలేదు.

సందానీ వాళ్ళమ్మ "మా సందానీ మీ ఇంటికి వచ్చాడా?" అంటూ అందరిళ్ళకీ వెళ్ళి అడిగి, ఆ రాత్రి అన్నం కూరా మూతపెట్టి, వీధి అరుగుమీదే కూర్చుంది. నాకూ సందానీ రాలేదని చాలా బెంగేసింది. "అమ్మా సందానీ ఇంక సినిమాల్లో అమితాబ్ బచ్చన్‌లా ఇంట్లోంచి పారిపోయి, విజయ్ అని పేరు మార్చుకుని, స్మగ్లర్ అయిపోతాడా?" అని అడిగాను.

"వాడి మొహం. ఆకలేస్తే వాడే వస్తాడు" అంది అమ్మమ్మ.

రాత్రి ఎక్కడ కుక్క అరిచినా, లేచి చూస్తూనే ఉన్నాను. సందానీ రాలేదు. వాళ్ళమ్మ ఏడుస్తూ, వాళ్ళ అబ్బాజాన్‌ని తెగ తిట్టింది.

నేనూ నా ఫ్రెండ్స్ సందానీ ఎక్కడికెళ్ళుంటాడా అని తెగ ఆలోచించాం. ఇంక రాడేమో. కాలవలో చేపలు పట్టడం, కుక్కపిల్లలనీ, పిల్లిపిల్లలనీ వాళ్ళమ్మకి తెలీకుండా ఎలా ఎత్తుకు రావడం? అని తెగ ఆలోచించాం.

సందానీ వాళ్ళ అమ్మీజాన్ ప్రొద్దుటే లేచి సందానీ మామ ఇంటికెళ్ళింది వేరే ఊరు. అక్కడే ఉంటాడు అని నాకు గట్టిగా అనిపించింది. సందానీ ఇంటికి రావాలని ఆంజనేయస్వామి హుండీలో పావలా వేసి పాతిక గుంజీలు తీసాను.

వాళ్ళమ్మ కాళ్ళీడ్చుకుంటూ మర్నాడొచ్చి "అక్కడా లేడు.." అని భోరుమని ఏడ్చింది. సాయంత్రానికి అంజనం వేసే ఉస్మాన్‌ని తీసుకొచ్చారు. సందానీ చిన్న చెల్లి చేతిలో కాటిక పూసి, పూజలో కూర్చోపెట్టారు. "అదిగో... అదిగో.. ఎక్కడో కాలవలో నీళ్ళల్లో మునుగుతున్నాడు" అన్నాడు ఉస్మాన్. వాళ్ళమ్మ భోరుమంది. చుట్టుపక్కల వాళ్ళు ఓదార్చారు. అబ్బాజాన్ కూడా నెత్తి బాదుకున్నాడు.

బుజ్జీ, వినోలియా వచ్చి సందానీ "కాలవలో మునిగిపోయాడుట" అన్నారు.

"ఎవరు చెప్పారు?" అన్నాను.

"ఉస్మాన్‌కి అంజనంలో తెలిసింది, చూసాడు" అన్నారు.

"వాడి మొహం.. సందానీకి ఈతొచ్చు" అన్నాను.

వాళ్ళూ "ఔను కదా!" అన్నారు.

నాలుగురోజులు మాకు ఇదే టాపిక్. సందానీ పెద్దయి పడవంత కార్లో వాళ్ళమ్మనీ చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ చూడ్డానికొచ్చినట్లు నేను కలకన్నాను.

కానీ ఐదోనాడు రాత్రి సందానీ వాళ్ళ అమ్మీజాన్ ఏడుపులు వినపడ్డాయి. అందరం గాభరా పడ్డాం. వెళ్ళి చూస్తే, చెంపలనిండా బొగ్గు మసితో సందానీ బిక్కమొహం వేసుకుని కనిపించాడు. వాళ్ళ అమ్మ 'చెయ్యిజారిన పెన్నిధి దొరికినట్లు వాడిని కౌగలించుకుని "మేరే జాన్.. మేరీ చాంద్ కీ తుకడా." అని ఏడ్చింది.

మరునాడు సందానీకి చేపలకూర వండి, వేడివేడి అన్నం పెట్టింది. వాడు తలంటోసుకుని, బొగ్గుమసి అంతా పోయి, హాయిగా ఉన్నాడు.

"ఎక్కడికి పోయావురా? ఏం చేసావ్?" అంటే నవ్వేసి జేబులో చెయ్యిపెట్టి అగ్గిపెట్టె తీసాడు "ఏ.వీ రమణీ.. నీకోసం ఏం తెచ్చినయ్ చూడు" అని అగ్గిపెట్టె తెరిచాడు. కెంపులా ఎర్రని ఆరుద్ర పురుగు ముద్దుగా నడుస్తోంది. దాన్ని చూసి ఆనందంతో నేను అన్ని మరిచిపోయా. దాంతో "వెల్వెట్ బుజ్జీ.. వెల్వెట్ బుజ్జీ" అని ఆడ్తూ ఉండిపోయాం.

ఆ తరువాత సందానీని వాళ్ళమ్మ ఎప్పుడూ కొట్టడం కానీ తిట్టడం కానీ చెయ్యలేదు. పెద్ద దర్గాకెళ్ళి మొక్కు తీర్చుకుని వచ్చింది.

మా అమ్మ కూడా ఆంజనేయస్వామికి అప్పాలు పోసింది. వాళ్ళ అమ్మీజాన్ మాత్రం ప్రపంచంలో అతి పెద్ద లాటరీ తనకే వచ్చినట్లు కనిపించింది నా కళ్ళకి.

తల్లి ప్రేమని దేనితోనూ పోల్చలేము సృష్టిలో. బిడ్డ కనిపించకపోతే తల్లికి ముద్ద నోటికి పోదు. ఈ ప్రేమకి ఉన్నవాళ్ళూ, లేనివాళ్ళూ అన్న వ్యత్యాసం లేదు.

ఎందుకు చెప్పానంటే ఇది పూర్వకాలం నాటి మాట. కానీ ఇప్పటికీ తల్లిదండ్రుల ప్రేమలో పెద్ద మార్పులేదు. కానీ బిడ్డల విషయంలో చాలా మార్పొచ్చింది. గూగులూ, స్మార్ట్‌ఫోనూ, ఎఫ్.బి అన్నీ వీళ్ళ విజ్ఞానాన్ని పెంచుతున్నాయేకానీ హృదయవైశాల్యాలనికాదు.

ఒక ఆసామి ఇంట్లో కొడుకు పెళ్ళి. వీధులు కట్టి విస్తర్లు వేసేటంత విందులు చేసాడు. ముక్కూ మొహం తెలీని వాళ్ళొస్తే మందులు పోయించాడు. కన్నతల్లిని వారం ముందు ఇంటికి తీసుకెళ్ళి మనవడి పెళ్ళి కళ్ళారా చూసేందుకు లేదంది అతని పెళ్ళాం. ఆవిడ పునిస్త్రీ కాదుకాబట్టి అమంగళంట. ఇతగాడిని ఆ తల్లి ఎంత కడుపుకట్టుకుని పెంచి ఉంటుందో. రక్తం పాలుగా మార్చి పెద్ద చేసిందో గుర్తులేదు. పెళ్ళాం మాట విన్నాడు. తల్లిని రానియ్యలేదు. పరాయి వాళ్ళకి మృష్టాన్న భోజనాలు పెట్టాడు. తల్లికి అన్నం పెట్టలేదు. తండ్రిగా కొడుకు పెళ్ళి వైభోగంగా అప్పులు చేసి మరీ చేస్తాడు.

ఇంకో ఇంట్లో తండ్రి కడుపు నిండా తింటే విరేచనాలు అవుతాయట. పెద్ద వయసుకాబట్టి, తిండి మానింపించేసాడు ఆ కొడుకు. ద్రవరూపాలే తాగమన్నాడు. పొద్దుటా, రాత్రి రాగిజావే. ఆ వృద్ధుడు ఓనాడు ఇంట్లోంచి పారిపోయాడు. ఎదురింటి తలుపు తట్టి "ఇంత అన్నం పెట్టమ్మా" అని అడుక్కున్నాడు.

"మీరు ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ గారి తండ్రి కదూ?" అని ఆ ఇల్లాలు తెల్లబోయింది.

ఓ కోడలు గొంతు చించుకుని అరుస్తోంది, అత్తగారు పిల్లలకని చేసి పెట్టిన చేగోడీలు తినేసిందిట. ఆ వృద్ధురాలు ఆకలి తట్టుకోలేక తిని ఉంటుంది. అంతమాత్రాన కొడుకు కూడా పెళ్ళానికి వంతపాడి "నిన్ను హోంలో చేర్పిస్తే నీకు బుద్ధొస్తుంది" అని అరుస్తున్నాడు.

ఆ తల్లి "మా నాయినే.. మా పండే" అని ఈ కొడుకుగాడికి ఎన్ని పిండివంటలు చేసి పెట్టిందో? ఎన్నిసార్లు జ్వరం వస్తే రాత్రిం పగళ్ళు సేవచేసి కన్ను తెరిచి, ఏం అడిగితే అది చేసి గోరుముద్దలు తినిపించిందో.. అతనికి గుర్తురాలేదు.

వీళ్ళ అరుపులూ, తిట్లూ నాలుగేళ్ళ కొడుకు వింటున్నాడు. గమనిస్తున్నాడు. తల్లితండ్రుల్ని ఎలా చూడాలో నేర్చుకుంటున్నాడు. అది వీళ్ళకి తెలీదు. ముసలితనం వచ్చాక తెలుస్తుంది.

మా వంశీరామరాజుగారి వేగేశ్నా వృద్ధాశ్రమంలో ఒకాయన వారం వారం "నల్లగుంటలో ఉన్న మా అబ్బాయి ఇంటికెళ్ళి కాకరకాయ కూర తినొస్తానండీ" అని కష్టపడి మూడు బస్సులు మారి వెళ్తుండేవాడుట.

"ఎందుకయ్యా ఆ కాకరకాయ కూర నేనే చేయిస్తా ఎందుకు అంత కష్టపడి వెళ్తావ్? నీ కోడలు అంత బాగా చేస్తుందా?" అంటే భోరుమన్నాడుట.

"అయ్యా.. దానికేం రాదు. అసలు అన్నం పెట్టడానికే ఏడుస్తుంది. ఆ వంక పెట్టుకుని మనవలని చూడ్డానికి వెళ్తున్నాను" అని.

ఇదీ ఈ కాలం వాళ్ళు సాధించిన ప్రగతి. ట్రెండ్ నేర్పలేని నీతి.

ముందు ముందు కన్నప్రేమ అంటే అర్థం గూగుల్ కొట్టి చూస్తారు.

మా అమ్మమ్మ తండ్రి, ఆయన తల్లికి రోజూ రాత్రిపూట తినడానికి కరకజ్జమో, కొమ్ముల పొట్లమో తెచ్చి మంచం కింద పెట్టేవాడుట. ఆవిడ అర్థరాత్రి ఆకలేస్తే లేచి తినేదట.

మా స్నేహితురాలు తండ్రి గదిలో సీసాల్లో పోసి పల్లీపాకం, నువ్వుల ఉండలూ, జీళ్ళూ పెట్టేది.

"ఎందుకే? చిన్నపిల్లాడా ఆయన?" అంటే అది ఓ జీవిత సత్యం చెప్పింది.

"పెద్ద వయసులో వాళ్ళకున్న గొప్ప కాలక్షేపం తిండేనే" అని.

వృద్ధులకి జిహ్వాచాపల్యం పెరగడం చాలా సహజం. వయసులో ఉన్నప్పుడూ, విధుల నిర్వహణలో బిజీగా ఉన్నప్పుడూ, చేతిలో డబ్బూ వంటిల్లూ వాళ్ళ ఆధీనంలో ఉన్నా ఆ పరుగులూ, ఉరుకులూ బాధ్యతల్లో వాళ్ళకి తినడానికి వ్యవధి ఉండదు. తరువాత తాము పొందికగా దీక్షగా పెంచిన వృక్షాలవంటి పిల్లల ఆశ్రయంలో సేద తీరుదాం అంటే వీళ్ళ స్వార్థాలూ, పైశాచికత్వం వాళ్ళని కుళ్ళపొడిచే మాటలు అంటూ, కడుపుకి ఇంత తిండికూడా పెట్టడంలేదు. ఓ కుటుంబంలో ఓ గుప్పెడు బియ్యం ఎక్కువ వెయ్యడానికీ, ఓ మంచం మూల వెయ్యడానికీ మొహం చూసుకుంటున్న ఈ నీచులకు వృద్ధాప్యం రాదా? వాళ్ళ పిల్లలు వీళ్ళనుండి నేర్చుకునే పాఠాలు ఇవి కావా?

ఈ ఆవేశంలో నవ్వించాలి అనుకున్నా నవ్వు రావడంలేదు. కన్నీళ్ళు కూడా రావడంలేదు. కోపం వస్తోంది.

Post your comments

